



• జిల్లాలోని చెరువుల్లో కనిపిస్తున్న నీటి నిల్వలు

చేప పిల్లలు.. వస్తున్నాయ్!

- జిల్లాలో కోటీ 23 లక్షల చేప పిల్లల పంపిణీ లక్ష్యం
- నేడు చేప పిల్లల పంపిణీకి టెండర్ల ఖరారు
- రిజర్వాయర్‌లలో రొయ్యల పెంపకంపై ప్రత్యేకదృష్టి
- చెరువులు, కుంటల్లో సరిపడా నీటినిల్వలు కరువు
- ఆగస్టు 1నుంచి చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం
- జిల్లావ్యాప్తంగా మొత్తం 240 చెరువులు

ఆదిలాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి): మత్స్యకార కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం యేటా ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగానే ఈ ఏడు టెండర్లను ఖరారు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే వ్యాపారులు టెండర్లను దాఖలు చేయడంతో మంగళవారం ఖరారు చేసేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో 68 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. మత్స్యకారులను అన్ని విధాల ఆదుకునేందుకు సమీకృత మత్స్య అభివృద్ధి పథకం కింద 2024-25 సంవత్సరానికి గాను జిల్లా వ్యాప్తంగా 240 చెరువుల్లో కోటీ 23 లక్షల చేపపిల్లలను పంపిణీ చేయడానికి అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. ఇందులో మత్స్యశాఖ పరిధిలో 62 చెరువులు ఉండగా.. గ్రామ పంచాయతీ పరిధిలో 178, మరో రెండు రిజర్వాయర్లు ఉన్నాయి. చెరువులు, కుంటల్లో 35-40 ఎంఎం సైజు, రిజర్వాయర్ ప్రాజెక్టుల్లో 80-100 ఎంఎం సైజు చేప పిల్లలను వదిలేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా సాత్నాల, మత్తడివాగు రిజర్వాయర్‌లలో 10 లక్షలకు పైగా రొయ్య పిల్లలను విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తం 68 సొసైటీల పరిధిలో 4,230 మంది మత్స్యకార్మికులు ఉన్నారు. ఇప్పటికే పెంచిన చేపలను అమ్ముకునేందుకు మత్స్యకారులకు ప్రత్యేక వాహనాలతో పాటు వలలు, మార్కెట్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ యేడూ జిల్లాలో ఉచిత చేప పిల్లల పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టడంతో మత్స్యకార్మిక కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఈ యేడు తగ్గిన లక్ష్యం

ఈ యేడు జిల్లాలో కోటీ 23లక్షల చేప పిల్లలను సరఫరా చేసేందుకు అధికారులు లక్ష్యం పెట్టుకున్నారు. దీననుగుణంగా టెండర్ ప్రక్రియను చేపడుతున్నారు. గతేడు కోటీ 29 లక్షల చేప పిల్లలను చెరువుల్లో, ప్రాజెక్టుల్లో వదిలారు. ఈ సారి మాత్రం లక్ష్యాన్ని తగ్గించి చేప పిల్లలను సరఫరా చేయను న్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే మరిన్ని చెరువులు, కుంటలలో చేప పిల్లలను పెంచాలని అధికారులు భావిస్తున్నారు. గతంలో శాటిలైట్ ద్వారా ప్రత్యేక సర్వే ను చేపట్టిన అధికారులు నీటి నిల్వలను గుర్తించారు. అలాగే ఇప్పటికే అందు బాటులోకి వచ్చిన 32 చెక్ డ్యాంలలో కూడా చేపపిల్లలను వదిలేందుకు సిద్ధమవు తున్నారు. కానీ జూలై మాసం గడిచిపోతున్నా.. చెరువులు, కుంటల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు కనిపించడం లేదు. ఆగస్టు 1 వరకు చెరువులు నిండితే పూర్తి లక్ష్యాన్ని చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. అయితే స్థానికంగా మంచి డిమాండ్ ఉన్న చేప పిల్లలను సరఫరా చేయాలని మత్స్య కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఈసారి కట్ల, రాహు, బొచ్చ, బంగారుతీగ లాంటి చేప పిల్లలను సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామ, మున్సిపాలిటీ పరిధిలో చేపల విక్రయానికి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అయితే వందశాతం రాయితీపై ఉచితంగా చేప పిల్లలను చెరువుల్లో వదలడంతో మత్స్యకారులకు కొంత ఆర్థికంగా కలిసి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఈ యేడు కొంత ఆలస్యమైనా ఆగస్టు నెలలోనే చేప పిల్లల సరఫరాను పూర్తి చేసేందుకు అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

రొయ్యపిల్లలకు ప్రాధాన్యత

జిల్లాలోని సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల్లో రొయ్య పిల్లలను వదిలేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రాజెక్టుల్లో యేడాదంతా సరిపడా నీటి నిల్వలు అందుబాటులో ఉండడంతో రొయ్యల పెంపకానికి అనుకూలంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అలాగే మార్కెట్‌లో రొయ్యలకు మంచి డిమాండ్ ఉండడంతో వీటి పెంపకంపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. కేజీ రొయ్యలు రూ.500 నుంచి రూ.600 వరకు ధర పలుకుతుంది. కాగా కిలో చేపలు రూ.200 నుంచి రూ.300 వరకే ధర ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రొయ్యల పెంపకంతో మూడు కాలాలపాటు మత్స్యకారులకు ఉపాధి కలుగు తుందని అధికారులు పేర్కొంటున్నారు. కానీ చేపలు పెంచే ప్రాజెక్టుల్లో రొయ్యలను పెంచుతే ఆశించి స్థాయిలో దిగుబడులు రావన్న అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. ప్రత్యేకంగా రొయ్యల పెంపకానికి ఏర్పాట్లు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. త్వరగా చేపల పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేస్తే చేపల ఎదుగుదల ఎక్కువగా ఉంటుందని మత్స్యకార్మికులు చెబుతున్నారు.

నీటి నిల్వలు అంతంతే..

ఈయేడు అడపాదడప కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటల్లో పూర్తి స్థాయిలో నీటి నిల్వలు కనిపించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో చేప పిల్లలను వదిలితే పెద్దగా ప్రయోజనం ఉండదంటున్నారు. మరో వారం రోజుల పాటు మాత్రమే వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. ఆగస్టులో అడపాదడప కురిసిన ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు ఉండవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ యేడు జూన్ 1నుంచి జూలై 22 వరకు జిల్లా సాధారణ వర్షపాతం 415.4 మి.మీ.లు కాగా, కేవలం 502.1 మి.మీ.ల వర్షపాతం మాత్రమే నమోదైంది. దీంతో చెరువులు, కుంటల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు కనిపించడం లేదం టున్నారు. అలాగే సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయి నీటిమట్టం కనిపించడం లేదు. ప్రస్తుతం సాత్నాల ప్రాజెక్టు నీటిమట్టం 283.63 మీటర్లు కాగా మత్తడివాగు ప్రాజెక్టు నీటిమట్టం 275.950 మీటర్లకు చేరుకుంది. అయితే, ఇంకా పూర్తిస్థాయికి నీటిమట్టం చేరుకోలేదు. మరో వారం రోజుల్లో వర్షాలు కురుస్తేనే పూర్తి స్థాయిలో చేపపిల్లల పంపిణీకి అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ప్రభుత్వ ఆదేశాలతో టెండర్ ప్రక్రియను నిర్వహిస్తున్నాం
: సాంబశివరావు, జిల్లా మత్స్యశాఖాధికారి

ప్రభుత్వ ఆదేశాలతో ఈ యేడు చేప పిల్లల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే పలువురు వ్యాపారులు టెండర్లను దాఖలు చేశారు. మంగళవారం టెండర్లను ఓపెన్ చేసి ఖరారు చేసే అవకాశం ఉంది. ఆగస్టు 1నుంచి చెరువుల్లో చేప పిల్లలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తాం. ఈ యేడు కొంత ఆలస్యమైన పూర్తిస్థాయిలో చేప పిల్లల సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం. కానీ చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో ఇంకా ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు కనిపించడం లేదు. మరో వారం రోజుల వరకు వర్షాలు కురుస్తే చేప పిల్లల పంపిణీకి అవకాశం ఉంటుంది. మత్స్యకారుల డిమాండ్ ప్రకారమే చేప పిల్లల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం.

సంక్షిప్త సమాచారం

'మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించాలి'

ఆదిలాబాద్ రూరల్, జూలై 22: ఆదిలాబాద్ మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అధికారులను కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో డీఈ తిరుపతితో వారు చర్చించారు. మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం ఉన్నప్పుడు లాండ సాంగ్వి పంపు హౌస్ నుంచి ఫిల్టర్ బెడ్ వరకు పైప్ లైన్ వేయాలని కోరారు. అలాగే వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల శ్రమదానం

ఉట్నూర్, జూలై 22: ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు శ్రమదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ పావని కుమారి నేతృత్వంలో విద్యార్థులు అధ్యాపకులు కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పావనికుమారి మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రతీఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా చేసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలలో నిలువ నీటి గుంటలో ఉన్నట్లయితే మురికి నీరు చేరి వాటిలో దోమలు వృద్ధి చెందుతాయని, తద్వారా అంటు వ్యాధులు ప్రబలుతాయని అన్నారు. ఇందేలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ చేరాల లక్ష్మణ్, అధ్యాపకులు కేశవులు, శ్రీనివాస్‌రావు, సువర్ణ, శ్రీలత, గణేష్, వినోద్, తిరుపతి, సుజాత, నవీన్, దశరథ్, కిషోర్, రూప, అధ్యాపకేతరులు, తదితరులు పాల్గొన్నారు.

లైవ్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీగా సుదన్

నేరడిగొండ, జూలై 22: గిరిజన లంబాడాల ఐక్య వేదిక (లైవ్) బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీగా సుదన్ పవార్ నాయక్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా సుదన్‌పవర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టడం సంతోషంగా ఉందన్నారు. బోథ్ మండల పరిధిలో లంబాడీల ఐక్యత కోసం తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. లైవ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్, స్టేట్ చీఫ్ కో ఆర్డినేటర్ జాదవ్ రమేష్, నాయక్‌లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజనేతరులకు పహాణి పత్రాలు ఇవ్వాలి : నాగోరావు

ఇంద్రవెల్లి, జూలై 22: గిరిజనేతరులకు పహణీలు ఇవ్వాలని గిరిజనేతరుల సంఘం నాయకులు సోమోరే నాగోరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద గిరిజనేతర రైతులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో 1970 ముందు నుంచి గిరిజనేతరులు సాగు చేస్తున్న పోరంబోకు, ప్రభుత్వ భూములకు వెంటనే హక్కు పత్రాలు జారీ చేసి పంట రుణాలతో పాటు రుణమాఫీ, రైతు భరోసా గిరిజనేతర రైతులకు అందించాలని ప్రభుత్వాన్ని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనేతర రైతులు రాంనివాస్, కాంబ్లె పీరాజీ, ముండేగణేష్, ఆచార్య గోపినాథ్, సంజీవ్‌రెడ్డి, సుందరసింగ్, ప్రేంసింగ్, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పెండింగ్ లేకుండా చర్యలు

• జిల్లా కలెక్టర్ రాజర్షిషా • కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యక్రమం • పాల్గొన్న ఆయా శాఖల అధికారులు


అర్జీదారుల సమస్యలను వింటున్న కలెక్టర్ రాజార్షిషా


డిజైన్ మ్యాప్‌లను పరిశీలిస్తూ..

ఆదిలాబాద్ అర్బన్, జూలై 22: ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చే అర్జీలను పెండింగ్ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో పాల్గొని అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను ఓపికతో విని కొన్ని అర్జీలను అక్కడికక్కడే పరిష్కారమయ్యే వాటిని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాఫిర్యాదుల విభాగంలో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ పెండింగ్ లేకుండా అధికారులు కృషి చేయాలని సూచించారు. కాగా రాంగనర్‌కు చెందిన దివ్యాంగులు శ్రీధర్ తనకు ఉపాధి కల్పించాలని కోరగా వెంటనే మహిళ శక్తి ద్వారా చేపడుతున్న కార్యక్రమంలో బ్యాంక్ లోను ఇప్పించి ఏదైనా ఉపాధి కల్పించాలని డీఆర్‌డీఓ సాయన్నను కలెక్టర్ ఆదేశించారు. గత వారం వరకు ఉన్న ఆయా శాఖలకు సంబంధించిన పెండింగ్ వివరాలు తెలుపుతూ వచ్చేవారం లోపు పరిష్కరించాలని, ప్రజా ఫిర్యాదుల పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా సూచించారు. ఇందులో ట్రైనీ కలెక్టర్ అభిగ్యాస్‌మాల్ వీయ, ఆర్డీవో వినోద్‌కుమార్, జీవికర్‌రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

• 'పనులు త్వరగా ప్రారంభించాలి'

ఆదిలాబాద్ అర్బన్: అమరవీరుల స్మృతివనం, కేస్లాపూర్ నాగోబా దేవాలయ నిర్మాణం, కుంటాల జలపాతం నిర్మాణ పనుల డిజైనర్, మార్క్యవుట్‌ను కలెక్టర్ రాజార్షిషా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కాంట్రాక్టర్‌లతో మాట్లాడుతూ నాగోబా దేవాలయ నిర్మాణం పనుల్లో జాతర కంటే ముందే అన్నదాన సత్రం పూర్తి చేసి, టర్నింగ్ నుంచి దేవాలయం కనిపించేలా ఏర్పాట్లు చేయా లన్నారు. ఏకోరిసోర్ట్ కుంటాల జలపాతం వద్ద 5ఎకరాలలో 8 కాటేజ్‌లు, రిసెప్షన్ సెంటర్, డైనింగ్, పార్కింగ్, గెస్ట్‌హౌజ్, పార్క్ తదితర అంశాలపై డిజైనర్ ప్రశాంత్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. డిజైన్ ఫైనల్ చేయడం జరిగిందని పనులు త్వరగా ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాథోడ్ భీమ్‌రావు, ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

• ఆయిల్‌పాం సాగుపై కలెక్టర్ సమీక్ష

ఆదిలాబాద్ అర్బన్: ఆయిల్‌పాం సాగుపై కలెక్టర్ రాజార్షిషా వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం రెండువేల ఎకరాలలో ఆయిల్ పాం ఏర్పాటు చేయాలని సూచించారు. ఇచ్చోడ, బోథ్, బజార్‌హత్నూర్, నేరడగొండ, సిరికొండ, మండలాల్లో 500 ఎకరాలలో, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, తలమడుగు, తాంసి, భీంపూర్‌లలో 900 ఎకరాలలో, ఆదిలాబాద్, రూరల్, అర్బన్, మావల జైనథ్, బేలలో 600 ఎకరాలలో ఈ పంటను సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులను ఐడెంటి పై చేయాలని తెలిపారు. నెల వారి టార్గెట్ 230 ఎకరాలలో ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారి, ఉద్యానవన శాఖ అధికారులతో కోఆర్డినేషన్ చేసుకొని లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఇందులో వ్యవసాయ అధికారి పుల్లయ్య, హార్టికల్చర్ సుధాకర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రానున్న తరాలకు భీమన్న దేవుడి చరిత్రను అందించాలి : మాజీ మంత్రి

ఆదిలాబాద్ అర్బన్, జూలై 22: భీమన్న దేవుడి చరిత్ర రానున్న తరాలకు సైతం అందించేలా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సోమవారం గాంధీపార్కులో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భీమ్మన్న బోనాల జాతరలో పాల్గొని భీమన్న దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ పాడి పరిశ్రమ సమృద్ధిగా పండి పుష్కలంగా వానలు కురవాలని భీమన్న దేవుడికి ప్రతియేటా ముదిరాజ్‌లు భక్తిశ్రద్ధలతో బోనాలు నిర్వహిస్తూ జాతర నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులున్నారు.


భీమన్న దేవుడికి పూజలు చేస్తున్న జోగు రామన్న


భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

అర్జిదారుల కోసం బొజ్జన్న బువ్వ : ఎమ్మెల్యే

ఉట్నూర్, జూలై 22: సుదూర ప్రాంతాల నుంచి ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే అర్జిదారుల కోసం ప్రతీ సోమవారం బొజ్జన్న బువ్వ కార్యక్రమం చేపట్టడం జరుగుతోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట బొజ్జన్న బువ్వ అన్నదాన కేంద్రం నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఈప్రాంత ప్రజలకు సేవ చేయాలనే ధృక్పథంతో ఎన్నికల ముందు నుంచే బొజ్జన్న బువ్వ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ అన్నదాన కార్యక్రమానికి సహకరిస్తున్న ఆర్డీవో, ఎంఆర్‌వో, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు ధన్యవాదములు తెలిపారు.


ఆదివాసీ, గిరిజనుల సమస్యలను తెలుసుకుంటున్న పీవో

త్వరితగతిన గిరిజన సమస్యల పరిష్కారం
• గిరిదర్బార్‌లో అర్జీలను స్వీకరించిన ఐటీడీఏ పీవో

ఉట్నూర్, జూలై 22: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. జన్నారం మండలం కమన్‌పల్లి గ్రామానికి చెందిన అమృత చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం చేయించాలని, లింగాపూర్ మండలంల లింగాపూర్ గ్రామంకు చెందిన అంకిత్ తనకి ఐటీఐ అడ్మిషన్ ఇప్పించమని, బజార్‌హత్నూర్ మండలం మెర్థండి గ్రామానికి చెందిన గంగకారుణ్య నియామక ఉద్యోగం కల్పించామని, లింగాపూర్ మండలం పూలగూడ గ్రామానికి చెందిన తానుబాయి ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని కోరారు. పింఛన్లు, రెండు పడక గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇందులో డీఎంజీసీసీ రామనాథం, అదనపు వైద్యాధికారి మనోహర్, ఏఓ దామోదర్, ప్రిన్సిపల్ మేస్రం మనోహర్,డీపీఓ ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• గ్రంథాలయాన్ని సందర్శించిన పీవో

ఉట్నూర్: మండలకేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పూర్వ పరీక్ష కేంద్రం, హేమన్‌డార్ఫ్ గ్రంథాలయాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త సోమవారం సందర్శించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడారు. గ్రూప్ వన్ కోసం సిద్ధమవుతున్న ఆరుగురు అభ్యర్థులు ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులు కావడం సంతోషంగా ఉందన్నారు. అంతేకాకుండా మెయిన్స్‌లో కూడా రాణించి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని పీవో ఈ సందర్భంగా పేర్కొన్నారు. హేమన్‌డార్ఫ్ గ్రంథాలయంలో డీఎస్సీ టెట్ ఉచిత శిక్షణ ఇవ్వడం జరిగిందని, అయితే టెట్‌లో 49మంది ఉత్తీర్ణులయ్యారని, డీఎస్సీ కోసం అభ్యర్థులు సన్నద్ధమవుతున్నారని ఇన్‌చార్జీ ప్రిన్సిపల్ మేస్రం మోహార్ పీవోకు వివరించారు. దీంతో స్పందించిన పీవో ఖుష్బుగుప్త మాట్లాడుతూ గ్రూప్ వన్, డీఎస్సీ అయ్యే వరకు భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ మాణిక్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి'

నేరడిగొండ, జూలై 22: రైతు బీమా పథకం కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఈవో జైపాల్ అన్నారు. సోమవారం మండలంలోని మాట్లొద్ది గ్రామంలో రైతు బీమాకు సంబంధించి జాబితాలో సవరణలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులు చేసుకునే రైతులు అప్లికేషన్ ఫారం, పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డుతో సంతకం పెట్టి సంబంధిత ఏఈవోలకు అందజేయాలని సూచించారు.


మాట్‌లొద్దిలో రైతు బీమా సవరణ చేస్తున్న ఏఈవో జైపాల్

'స్మితాసబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలి'

ఆదిలాబాద్ అర్బన్, జూలై 22: ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ దివ్యాంగుల రిజర్వేషన్ కోటపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా దివ్యాంగుల నిరుద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సలీమ్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంటనే స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ముత్యాల సురేష్, వికలాంగుల కోఆర్డినేటర్ ప్రమోద్‌కుమార్‌శిండే, జిల్లా ఆర్గనైజర్ బంక రాజశేఖర్, పొచ్చన్న, కృష్ణ, బావునే నగేష్ తదితరులున్నారు.

దొంగలను పట్టుకున్న ఐడీ పార్టీ పోలీసులు

ఆదిలాబాద్ రూరల్, జూలై22: ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను టూ టౌన్ ఐడీ పార్టీ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఈనెల 11న మార్కెట్ యార్డులో సురేష్, మల్లయ్యలు నల్లాలను దొంగలించి స్క్రాప్ దుకాణంలో అమ్మి వేసినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. కాగా ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఫింగర్ ప్రింట్ ఆధారంగా సోమవారం దొంగలను ఐడీ పార్టీ పోలీసులు బొట్టు రమేష్, క్రాంతికుమార్, నరేందర్, సుధాకర్ రెడ్డి, ప్రవీన్ పట్టుకున్నట్లు తెలిపారు.



బిడ్డతో వచ్చి చెక్కును అందుకుంటున్న ఓ లబ్ధిదారు

పేద బిడ్డలకు అండగా కల్యాణలక్ష్మీ

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, జూలై 22: పేదింటి ఆడ బిడ్డలకు కల్యాణలక్ష్మి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో సోమవారం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన 26మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీచేశారు. ప్రభుత్వపరంగా మంజూరయ్యే పథకాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజుయాదవ్, ఎంపీటీసీ మాజీ నారాయణరెడ్డి, తహసీల్దార్ సుభాష్‌చంద్ర, ఎంపీడీవోరమేష్, డిప్యూటీ తహసీల్దార్ భూమేష్ పాల్గొన్నారు.

హమ్మయ్య ఎన్నిరోజులకు కల్యాణలక్ష్మీ అందింది..

మండలకేంద్రంలో సోమవారం చేపట్టిన కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఓ మహిళ తన బిడ్డతో కలిసి వచ్చి ఎమ్మెల్యే జాదవ్ అనిల్ చేతుల మీదుగా చెక్కును అందుకుంది. పెళ్లి జరిగి బిడ్డ పుట్టిన తర్వాత చెక్కు వచ్చిందని, డబ్బు బిడ్డ పేరున డిపాజిట్ వేయాలని పలువురు ఆ మహిళను సలహాలిచ్చారు.

● 'క్యాంపు కార్యాలయానికి మేం రాం'

పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరు కాగా, ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని మొదట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేయాలని నిర్ణయించారు. గతంలో సైతం ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో చెక్కులు పంపిణీ కార్యక్రమానికి కాంగ్రెస్‌పార్టీ నాయకులు గైర్హాజరయ్యేవారు. సోమవారం చేపట్టిన కార్యక్రమాన్ని క్యాంపు కార్యాలయంలో చేపడితే తాము రాబోమని కాంగ్రెస్ పార్టీ నాయకులు తేల్చి అధికారులకు చెప్పారు. దీంతో అధికారులు కార్యక్రమాన్ని రైతు వేదికకు మార్చాల్సి వచ్చింది. కార్యక్రమానికి పదవులు కోల్పోయిన ప్రజాప్రతినిధులు స్టేజీపై ఉండడంతో ప్రభుత్వ కార్యక్రమాన్ని పార్టీ కార్యక్రమంగా మార్చాలంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

'ప్రభుత్వ ఆసుపత్రిల్లో ఎంపీహెచ్‌ఏ మేల్ పోస్టులను భర్తీచేయాలి'

బోథ్, జూలై22: రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఎంపీహెచ్‌ఏ పురుషుల పోస్టులను భర్తీ చేయించాలని క్వాలిఫైడ్ ఎంపీహెచ్‌ఏ శిక్షణ పూర్తయిన నిరుద్యోగులు స్థానిక ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు వినతిపత్రం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 10 వేలకుపైగా పోస్టులు ఖాళీ ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం ఏఎన్ఎం మహిళా పోస్టులను భర్తీకి నోటిఫికేషన్ జారీచేసి ఎంపీహెచ్‌ఏ పురుషులను నియమించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. శిక్షణ పూర్తి ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న తమకు న్యాయం చేయాలని కోరా రు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

ఆదివాసీ చిత్రకళాకారులకు ప్రభుత్వం అండ

● కాంగ్రెస్ నాయకులు ఆత్రం సుగుణ

ఉట్నూర్, జూలై22: ఆదివాసీ చిత్ర కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. ఉట్నూర్ మండలకేంద్రంలో సోమవారం తెలంగాణ ఆదివాసి చిత్రకళ అసోసియేషన్ ఆవిర్భావ సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకున్న టీఏసీఏ కమిటీ సభ్యలను శాలువాతో సన్మానించారు. అనంతరం సుగుణ మాట్లాడుతూ అంతరించే కళలను చిత్రాల ద్వారా బయట ప్రపంచానికి చూపెట్టవలసిన బాధ్యత చిత్రకళాకారులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చిత్రకారులు, జల్కేపాండురంగ్, విక్రమ్, సునిల్, కనకవెంకటేశ్వర్‌రావు, నూతనంగా ఎన్నికైన టీఏసీఏ అధ్యక్షుడు సిడాం నాగేష్, జనరల్ సెక్రటరీ గేడం మధుకర్, కమిటీ సభ్యులు గణేష్, రూపేష్, చత్రుఘన్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆశాల ఆందోళన

ఆదిలాబాద్ రూరల్, జూలై 22: ఆశాలకు నష్టం కలిగించే, పరీక్షలు పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. సోమవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ముందుగా సీఐటీయూ కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీగా వచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఆశా కార్యకర్తలకు పని భారం తగ్గించాలని జాబ్ కార్డు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

.. మున్సిపల్ కార్మికుల ఆందోళన

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. పారిశుద్ధ్య ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ప్రతి నెల 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతన రూ.26 వేలు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు.

చెట్లతోనే మానవ మనుగడ

నేరడిగొండ, జూలై 22: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని హ్యూమన్‌రైట్స్ బృందం జిల్లా అధ్యక్షుడు ఎన్‌టీ రమణ, ఉపాధ్యక్షుడు సత్యనారాయణలు అన్నారు. మండలంలోని కుప్టి గ్రామంలో గల జాతీయ రహదారి పక్కన మొక్కల వనం ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్న సామాజిక కార్యకర్త కొయ్యాడి గంగయ్యను సోమవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. గంగయ్య వివిధశాఖల అధికారులతో మొక్కలను నాటిస్తూ వాటిని సంరక్షిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో హ్యూమన్‌రైట్స్ బృందం జిల్లా ప్రధాన కార్యదర్శి అమృత్‌కుమార్, లింగూర్తి, వెంకట రమణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే

బోథ్, జూలై22: మండలంలోని వివిధ గ్రామాల్లో మృతుల కుటుంబాలతోపాటు అనారోగ్యం పాలైనవారిని సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరామర్శించారు. బోథ్ పట్టణ మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్ ఇటీవల కంటి ఆపరేషన్ చేసుకోవడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకులు చిలుక రాకేష్ తల్లి ఇటీవల మృతిచెందడంతో ఆయనను పరామర్శించారు. అనంతరం పొచ్చెరలో విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన యువకుడి తండ్రిని పరామర్శించారు. ఆయనవెంట మాజీ జడ్పీటీసీ డాక్టర్ సంధ్యారాణి నేరడిగొండ మాజీ ఎంపీపీ సజానాల్, నాయకులు పాల్గొన్నారు.

'అమ్మ పేరుతో మొక్కను నాటండి'

ఆదిలాబాద్‌రూరల్, జూలై22: వాతావరణ సమతుల్యం కోసం ప్రధాని మోదీ పిలుపుమేరకు ప్రతీఒక్కరు అమ్మపేరుపై మొక్కను నాటాలని ఎమ్మెల్యే పాయల శంకర్ కోరారు. సోమవారం ఆదిలాబాద్ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో అమ్మపేరుపై మొక్కతోపాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి నీరుపోశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అనిత, బీజేపీ నాయకులు సోమ రవి, రవి, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

'రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దు'

ఉట్నూర్, జూలై 22: రాష్ట్రప్రభుత్వం రైతులరుణమాఫీ చేసినందున బ్యాంకు అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు.సోమవారం ఉట్నూర్ మండల పరిధి లోని రైతులు ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను కలిసి బ్యాంకు అధికారులు రుణమాఫీ విషయంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని గోడును చెప్పుకున్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే మండలకేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకును సందర్శించారు. బ్యాంకు మేనేజర్‌తో పాటు సంబంధిత బ్యాంకు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యలను తెలిపారు. సమస్యలు పరిష్కారం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రుణమాఫీ అయిన రైతుల జాబితాను పరిశీలించారు. ఈ ప్రాంత రైతులను ఇబ్బందులకు గురి చేయోవద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా రుణమాఫీ చేసిందని పేర్కొన్నారు. దళారి వ్యవస్థను ప్రోత్సహించకుండా నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులను జమ చేయాలని సూచించారు. దళారులు బ్యాంకు వ్యవహారాలలో జోక్యం చేయకుండా అలాంటి వారిపై పటిష్ట నిఘా ఉంచాలని పేర్కొన్నారు. రుణమాఫీ కానీ రైతులు దిగులు చెందొద్దని ప్రతి రైతుకు రుణమాఫీ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. వారివెంట రైతులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

'కొబ్బరిసాగుకు ప్రోత్సాహక రాయితీలు'

ఉట్నూర్, జూలై 22: ఉమ్మడి ఆదిలాబాద్‌లోని సాగునీటి సౌకర్యం ఉన్న రైతులకు కొబ్బరి సాగు పై ఆసక్తి ఉంటే రాయితీలు ప్రోత్సాహకాలు లభిస్తాయని ఉట్నూర్ ఐటీడీఏ పండ్ల తోటల ఉద్యానవన ప్రాజెక్టు అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్ తెలిపారు. కొబ్బరి అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాయితీలు, ప్రోత్సాహకాలు అందించే వీలున్నందున ఉమ్మడి జిల్లాలోని రైతులు కొబ్బరిసాగు చేయవచ్చు అన్నారు. ఒక్కొక్క రైతు పది ఎకరాలలో నాలుగు హెక్టార్లకు రాయితీ పొందే అవకాశం ఉందన్నారు. ఒక హెక్టార్‌కు 150 కొబ్బరి మొక్కలు నాటవచ్చు అన్నారు. ఏలూరులోని కొబ్బరి అభివృద్ధి సంస్థ నర్సరీలో ఒక్కొక్క మొక్క రూ.80కి లభిస్తాయని, ఒక హెక్టార్‌కు సబ్సిడీ రూ.6500 వీటిని మొదటి రెండు సంవత్సరాలలో రెండు సమభాగాలుగా ఇస్తారన్నారు. మొదటి సంవత్సరం రాయితీ ఒక హెక్టార్‌కు రూ.3250, రెండవ సంవత్సరం కూడా అంతే మొత్తం లభిస్తుందన్నారు. మొక్కల రవాణా చార్జీలు రైతులే భరించాలన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూచన మేరకు ఆసక్తి ఉన్న రైతులకు ప్రోత్సాహం ఇవ్వాలని చూస్తున్నామన్నారు. ఈ మేరకు విజయవాడలోని కొబ్బరి అభివృద్ధి సంస్థ అధికారులతో సమన్వయం చేస్తున్నామని, ఆసక్తి ఉన్న రైతులు తనను ఫోన్ 9032313933లో సంప్రదించాలని కోరారు.

'రుణమాఫీ అమలుపై ద్వంద్వ వైఖరి'

జైనథ్, జూలై 22: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీపై ద్వందవైఖరి అవలంబిస్తోందని, మండలంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ద్వారా రైతులు తీసుకున్న రుణాల రికార్డులు సరిగ్గాలేవని మండలంలోని దీపాయిగూడ, జైనథ్ గ్రామాల రైతులు సోమవారం తహసీల్దార్ శ్యాంసుందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఈజీఎస్‌జిల్లా అధికార ప్రతినిధి అల్లకొండ అశోక్ మాట్లాడుతూ 2018 కటాఫ్ తేదీకి అనుగుణంగా రూ.లక్ష రుణం లేపితే లక్ష రుణం మాఫీ కావాలన్నారు. ఇందుకు విరుద్ధంగా జైనథ్ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర పైకి రికార్డులను తప్పిదంగా పంపిందన్నారు. ఇందుకు జైనథ్ మండల కేంద్రంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర సిబ్బందిని పూర్తిగా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా రిలే నిరాహార దీక్షలు చేస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు.



జైనథ్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పెన్‌గంగా నదిలో యువకుడి గల్లంతు

● డొల్లార వద్ద డీడీఆర్‌ఎఫ్ బృందం గాలింపు చర్యలు ముమ్మరం ● ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆదిలాబాద్ ఎస్పీ గౌస్‌ఆలం



వివరాలు తెలుసుకుంటున్న ఆదిలాబాద్ ఎస్పీ గౌస్‌ఆలం



పెన్‌గంగా నదిలో గాలిస్తున్న డీడీఆర్‌ఎఫ్ బృందం



కొత్తం శివకార్తిక్(ఫైల్)

జైనథ్, జూలై22: మండలంలోని సరిహద్దున గల డొల్లార పెన్‌గంగా నదిలో ఆదివారం రాత్రి ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చాందా(టి) గ్రామానికి చెందిన కొత్తం శివకార్తిక్(23) గల్లంతయ్యారు. కొత్తం శివ కార్తిక్ శివ గాలింపులకు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఆధ్వర్యంలో సోమవారం డీడీఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దిగారు. కార్తిక్ మృతదేహం కోసం పోలీసులకు ఎస్పీ గౌస్‌ఆలం పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జైనథ్ మండల రూరల్ సీఐ సాయినాథ్, జైనథ్ ఎస్సై వి.పురుషోత్తంలతో పాటు పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

● విషాదంలో బొప్పరికుంట

ఉట్నూర్: మండలంలోని బొప్పరికుంట గిరిజన గ్రామంలో విషాధ చాయలు అలముకున్నాయి. బొప్పరికుంటకు చెందిన గిరిజన యువకుడు టేకం లక్ష్మణ్ గత శనివారం రాత్రి గంగాపూర్ వాగు వరద ప్రవాహంలో కొట్టుకుపోగా ఆదివారం నుంచి ఉట్నూర్ డివిజన్ పోలీసు సూపరింటెండెంట్ నాగేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక గజఈతగాళ్ల బృందంతో గాలింపు చర్యలు నిర్వహిస్తున్నారు. సోమవారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండికోట మొగిలి ఆధ్వర్యంలో గజ ఈతగాళ్లు వాగులో గాలింపు నిర్వహించారు. తమ గ్రామానికి చెందిన టేకం లక్ష్మణ్ వరద ప్రవాహంలో కొట్టుక పోయాడని సోమవారం గ్రామస్థులందరు కూడ వాగు వద్దకు చేరుకుని లక్ష్మణ్ మృతదేహం అయిన దొరుకుతందా అని ఎదురు చూస్తు ఉండిపోయారు. రెండున్నర ఏళ్ల క్రితం నర్సాపూర్ బుడ్డిగూడ ప్రాంతానికి చెందిన సీతబాయితో లక్ష్మణ్ వివాహం జరగడంతో ఆయన భార్య కూడా బంధువులతో కలిసి వాగు గట్టున బోరున విలిపిస్తోంది. అదేవిధంగా వరదనీటి ప్రవాహం అధికంగా ఉండడంతో గజ ఈతగాళ్లకు కూడా లక్ష్మణ్ ఆచూకి లభించ లేదని, నీటి ప్రవాహం తగ్గితే ఎక్కడైనా శవం కనీసం బయటపడవచ్చు అని సీఐ గండికోట మొగిలి తెలిపారు.



గంగాపూర్‌వాగు వద్ద రెండో రోజు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టిన సీఐ గండికోట మొగిలి

సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలి

● పీవోను కోరిన ఎస్‌టీయూ ప్రతినిధులు

ఉట్నూర్, జూలై 22: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయం సమావేశం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు కోరారు. సోమవారం ఉట్నూర్ మండలకేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయంలో పీవో ఖుష్బుగుప్తను కలిసి బదిలీలు పదోన్నతులలో తలెత్తుతున్న సమస్యల నివృత్తి చేయాలని ఎస్టీయూ జిల్లా నాయకులు కోరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూగ శ్రీనివాస్, జాదవ్ అశోక్‌కుమార్, రాష్ట్ర అధనపు ప్రధాన కార్యదర్శి దిలేష్‌చౌహాన్‌లు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో జరుగుతున్న బదిలీలు, పదోన్నతులలో పండిత్, పీఈటీ పోస్టులను వెంటనే అప్‌గ్రేడ్ చేయాలని, ఉన్నతీకరించబడిన ఆశ్రమ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయాలని, 317 జీవో ద్వారా రీ-అలకేషన్ పొందిన ఉపాధ్యాయులకు బదిలీలలో అవకాశం కల్పించాలని, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికి వెంటనే ఉపాధ్యాయ సంఘాలతో కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించాలని, ప్రస్తుతం చేపడుతున్న పదోన్నతులకు మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరారు. ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను పీవో దృష్టికి తీసుకు వెళ్లామన్నారు. ముఖ్యంగా జిల్లాలోని అన్ని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛమైన తాగునీళ్ల కొరకు ఆర్‌వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలని, సోలార్ వాటర్ హిటర్లను ఏర్పాటు చేయాలని ఆశ్రమ పాఠశాలలో తగినన్ని మరుగుదొడ్లు, బాత్‌రూంలను నిర్మించాలని, శానిటరీ వర్కర్స్‌ను నియమించాలని, ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యా యులకు జాబ్‌చార్ట్‌కు విరుద్ధంగా కేటాయిస్తున్న సూపర్విజన్, టర్న్ డ్యూటీలను నిలిపి వేయాలని, ఆశ్రమ పాఠశాలల నుంచి హాస్టల్‌లను వేరు చేయాలని, విద్యార్థుల సంరక్షణ కోసం ప్రత్యేక కేర్ టేకర్ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శీతల్‌చౌహాన్‌తో పాటు పలువురు ఎస్టీయూ జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పేరుకగూడ సమీపంలో నీటిలో మునిగిన పంటచేను

చెరువును తలపిస్తున్న పంట చేను

ఉట్నూర్, జూలై 22: గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పెర్కగూడ సమీపంలో పంట చేను పూర్తిగా నీటితో నిండిపోయి చెరువును తలపిస్తుంది. ఈ నీటి ప్రవాహం ఆర్‌అండ్‌బి రోడ్డు పైకి రావడంతో ఉట్నూర్ మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు సోమవారం జేసీబీ సహాయంతో పంట చేనులో ఉన్న నీటిని వాగుకు తరలించేలా నాలా తీశారు. ఈ పంట భూమిలో ఎవరు కూడా వ్యవసాయం చేయడం లేదని మండల వ్యవసాయ అధికారి రాథోడ్‌గణేష్ తెలిపారు. ఇటీవల వర్షాలకు ఎక్కడా కూడా పంట నష్టం జరుగలేదని వివరించారు.

గుంతలమయమైన ప్రధాన రోడ్డు



వర్షాలకు గుంతలమయంగా మారిన కప్పర్ల-ఆదిలాబాద్ రోడ్డు

తాంసి, జూలై 22: మండలంలోని కప్పర్ల గ్రామం నుంచి ఆదిలాబాద్ వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి, ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి అందులో నీరు చేరడంతో రోడ్డు చెరువును తలపిస్తోంది. దీంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

రోడ్లపైకి మురికినీరు.. స్థానికుల ఇక్కట్లు

భోథ్, జూలై 22: మండల కేంద్రంలో ఎటు చూసినా రోడ్లపై మురికి నీరు ప్రవహిస్తోంది. రోడ్లపై ప్రయాణించాలంటే ప్రజలు జంకుతున్నారు. మండల విద్యాధికారి కార్యాలయం ముందు నీరు నిలవడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందుల పాలవుతున్నారు. మురికి కాలువలు నిండటంతో ఇబ్బందులు తప్పడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు.



ఎంఈఓ కార్యాలయం ముందు నిలిచిన మురికినీరు



ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డుపై పారుతున్న మురికినీరు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

● కీటక జనిత వ్యాధులపై గ్రామాల్లో పూర్తిస్థాయి అవగాహన ● పరిశుభ్రతే పరిష్కారం అంటున్న వైద్య సిబ్బంది



ఇంటింటికి తిరుగుతూ పరిసరాల పరిశుభ్రతను పరిశీలిస్తున్న వైద్య, గ్రామ పంచాయతీ సిబ్బంది

దిలావర్‌పూర్, జూలై 22 : సీజనల్ వ్యాధులపై వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తం అయ్యింది. గ్రామాల్లో ప్రబలుతున్న కాలానుగుణంగా వచ్చే వ్యాధులను అవగాహన కార్యక్రమాలు చేపట్టి చెక్ పెట్టేందుకు నిర్ణయించింది. ఈ మేరకు వ్యాధులు దరిచేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

వానాకాలం వ్యాధులకు అనుకూలం..

వానాకాలం వచ్చిందంటే వ్యాధులు రావడం సాధారణమే.. అయితే అందుకు కారణం మాత్రం ఇళ్లతో పాటు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవ మనేది అతిశయోక్తి కాదు. పరిశుభ్రతను పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. రోడ్లు, ఇళ్ల పరిసరాల్లో చెత్తా చెదారం వేయడం, నీటిని నిల్వ ఉంచడం వంటివి చేయడం వల్ల ఈగలు, దోమలు వ్యాధులను మోసుకొచ్చి మనుషుల ప్రాణాలను హరిస్తాయి.

కీటక జనిత వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన..

పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోతే వచ్చే వ్యాధులపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇళ్లలో చెత్తా చెదారం లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. మన పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీటి నిల్వ వల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది మన అనారోగ్యానికి కారణ మవుతాయని వివరిస్తున్నారు. నీటిని నిల్వ ఉంచుకునే ప్లాస్టిక్ డ్రమ్ములను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి వైద్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ టీచర్ల సహకారంతో వారానికి రెండు రోజులు ఇంటింటికి తిరుగుతూ... ప్రజలకు అవ గాహన కల్పిస్తూ అప్రమత్తం చేస్తున్నారు.

పంచాయతీల ఆధ్వర్యంలో శుభ్రత చర్యలు

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పల్లె ప్రగతిలో భాగంగా పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతనిస్తున్నాయి. ప్రతి గ్రామానికి ఒక ట్రాక్టర్ ఇవ్వడంతో పాటు మొక్కల పెంపకానికి ట్యాంకర్‌ను ఇచ్చారు. డంపిగ్ యార్డ్‌లను నిర్మించాయి. పంచాయతీ సిబ్బంది ప్రతిరోజు వార్డులు తిరుగుతూ తడి, పొడి చెత్తలను సేకరించి డంపింగ్ యార్డ్‌లకు తరలిస్తున్నారు. డ్రైయిన్లు, రోడ్లను శుభ్రం చేస్తున్నారు.

పరిశుభ్రతతో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం

గ్రామాల పరిశుభ్రతతో వైద్యసిబ్బందితో పాటు పారిశుద్ధ్య కార్మికులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో ట్రాక్టర్ ద్వారా ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌లకు తరలిస్తున్నారు. మరోవైపు గ్రామాల్లోని మురికి నీటి కాలువల్లో పూడికను తొలగించి కాలువలను శుభ్రం చేస్తున్నారు. రోడ్లను ప్రతి రోజు శుభ్రం చేస్తున్నారు. దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా డ్రైనేజీలలో రసాయన ద్రవాలను పిచికారీ చేయడంతో పాటు నెలలో రెండు సార్లు ఫాగింగ్ చేస్తారు. అయితే వీరి కష్టానికి తగిన ఫలితం లేదన్న విమర్శలున్నాయి. అసలే తక్కువ వేతనం... అది కూడా నెలనెల ఇవ్వకుండా కొంతమంది పంచాయతీ కార్యదర్శులు వేధిస్తున్నట్లు తెలిసింది. ప్రతి నెల చెల్లించాల్సిన వేతనాన్ని ఐదారు నెలలకు ఒకసారి, కొందరైతే ఎనిమిది, తొమ్మిది నెలలకు ఇస్తున్నట్లు తెలిసింది. దీంతో పారిశుధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పరిశుభ్రత, వ్యాధుల పట్ల అప్రమత్తం అవసరం



ఇళ్ల వద్ద పూలకుండీలు, పెంకులు, కొబ్బరి చిప్పలు, కొబ్బరి బొండాలు, ఖాళీ టైర్లు, డ్రమ్ములు, ప్లాస్టిక్ డబ్బాలు లాంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఆశా కార్యకర్తలు అంగన్‌వాడీలతో కలిసి వారానికి రెండు రోజులు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తూ, పరిసరాలు పరిశీలిస్తున్నారు. ప్రధానంగా నిల్వ ఉన్న నీటిలో లార్వా పెరిగే అవకాశం ఉంది. జాగ్రత్తలు పాటించకపోతే దోమలు పెరిగి మలేరియా, బోధకాలు, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు లాంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. రాత్రి పడుకునే ముందుకు కుంపటిలో వేపాకుతో పొగ వేయాలి. జ్వరం వచ్చిన వెంటనే గ్రామంలోని ఆశా కార్యకర్తలకు తెలియ జేయాలి. ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందాలి. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దు. సర్కార్ దవాఖానాలోనే చికిత్స పొందాలి. ముఖ్యంగా పరిశుభ్రత పాటించాలి. వ్యాధుల పట్ల అప్ర మత్తంగా ఉండాలి.

- డా. శ్యామ్ కుమార్, వైద్యాధికారి, దిలావర్‌పూర్ పీహెచ్‌సీ

బ్యాంక్ వద్ద రైతుల ఆందోళన



పొన్కల్‌లోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర దగ్గర ఆందోళన చేస్తున్న రైతులు

మామడ రూరల్, జూలై 22 : మండలంలోని పొన్కల్ గ్రామంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వద్ద రైతులు ఆందోళనకు దిగారు. సోమవారం గ్రామానికి వచ్చిన వ్యవసాయ అధికారి, ఏఈవో సుస్మితలకు తమ గోడును విన్నవించుకోగా వారు మేనేజర్ రఘు వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్య మహారాష్ట్ర బ్యాంక్‌లో మాత్రమే వచ్చిందన్నారు. బ్యాంక్ వారు పంపిన లిస్టును బయట అతికించాలని రైతులు డిమాండ్ చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి రుణమాఫీ చేయడంతో ఈ బ్యాంక్‌లోనే రూ. లక్ష తీసుకున్న రైతులకు రూ. 60,000, రూ. 30,000, రూ. 20,000 ఇలా రావడంతో రైతులు బ్యాంక్‌కు వచ్చి మేనేజర్‌ను నిలదీశారు. మీరు ఎలాంటి ఇబ్బందులకు గురికావద్దని ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లి సమస్యను పరిష్కరిస్తామన్నారు. సాంకేతిక లోపం వల్లనే ఇలా జరిగిందని మేనేజర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంతో పాటు చుట్టు ప్రక్కల పది గ్రామాల రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

ఇటీవల మృతి చెందిన పాత్రికేయులకు నివాళులు

నిర్మల్ కల్చరల్, జూలై 22 : జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు అంకం రాములు, తానూర్ మండల కేంద్ర విలేఖరి యంత్రాల గంగారెడ్డికి సోమవారం నిర్మల్ ప్రెస్ క్లబ్ నివాళులర్పించింది. ప్రెస్ క్లబ్‌లో సమావేశం నిర్వహించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. వారి సేవలను కొనియాడుతూ కుటుంబ సభ్యులకు సంతాపం, సానుభూతి తెలిపారు. జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఘనంగా దాశరథి కృష్ణమాచార్య జయంతి

తానూర్, జూలై 22 : మండల కేంద్రం తానూర్‌లోని వాగ్దేవి విద్యానికేతన్ పాఠశాలలో సోమవారం తెలంగాణ దిక్కరస్వరం దాశరథి కృష్ణమాచార్య జయంతిని ఘనంగా నిర్వహించారు. సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అరవింద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల బెడద తప్పించాలని వినతి

ముథోల్, జూలై 22 : మండలంలోని రాంటెక్ గ్రామంలో కుక్కల బెడద తగ్గించాలని సోమవారం ముథోల్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదు విభాగంలో డిప్యూటీ తహసీల్దార్ రామారావుకు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో కుక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో అవి పశువులు, మనుషులపై దాడులకు దిగుతున్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. రాత్రి రహదారులపై వెళ్లే వారిని వెంబడిస్తూ భారీగా అరుస్తున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఎల్‌వోసీ అందజేసిన మాజీ శాసనసభ్యుడు జి. విఠల్‌రెడ్డి

భైంసా రూరల్, జూలై 22 : భైంసాకు చెందిన సాయికి చేయి విరిగింది. మాజీ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి శస్త్రచికిత్స నిమిత్తం సుమారు ఒక లక్ష యాభై వేల రూపాయల ఎల్‌వోసీ కాపీని దేగాం గ్రామంలో బాధితుడికి అందజేశాడు.

భయాందోళనలో పెంకుటిళ్లవాసులు



పెంకుటిల్లు తడిసిపోకుండా కట్టిన ప్లాస్టిక్ కవర్



గోడకు సపోర్టుగా ఉంచిన కలపదుంగలు

భైంసా,జూలై 22 : డివిజన్ పరిధిలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల మూలంగా పెంకుటిళ్లలో నివాసముంటున్న జనాలు భయాందోళనలు చెందుతున్నారు. క్రమం తప్పకుండా కురుస్తున్న వర్షాల మూలంగా పెంకుటిళ్ల గోడలు తడిసి ప్రమాదకరంగా మారుతుండటంతో బీతిల్లిపోతున్నారు. శనివారం నుంచి కురుస్తున్న వర్షాల మూలంగా .అధికశాతం ఈ ప్రాంతాల్లోని పెంకుటిళ్ల గోడలు ప్రస్తుతం తడిసిపోయి ప్రమాదకరస్థితికి చేరుకున్నాయి. గోడలు ఎప్పుడు కూలి పడిపోతాయోనన్న బెంగ పెంకుటిళ్లవాసులకు కంటికి కునుకు లేకుండా చేస్తోంది. వర్షాలు కురుస్తున్న సమయంలో సంబంధిత పెంకుటిళ్ల వాసులు పగలు తమ పెంకుటింట్లో ఆందోళన మధ్యనే గడుపుతూ రాత్రి వేళలో మాత్రం తమ తమ ఇళ్లలో కాకుండా సమీప ప్రాంతాల్లోని బంధువులు, మిత్రుల ఇండ్లలో పడుకొంటున్నారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్న పెంకుటిళ్లవాసులు తప్పనిసరి పరిస్థితుల్లో అదే ఇండ్లలో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.గోడలు కూలిపోకుండా తాత్కాలిక ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. తడిసిపోయి ప్రమాదకర స్థితికి చేరుకున్న గోడలు కూలిపోకుండా ఉండేందుకు గాను కర్రలను అడ్డంగా పెడుతూ, ప్లాస్టిక్ కవర్లను కప్పుతూ కాపాడుకునే చర్యలు చేపడుతున్నారు. కొంత మంది ప్రాణభయంతో తమ పెంకుటిళ్లను ఖాళీ చేసి అద్దె ఇళ్లలోకి మారిపోతున్నారు. ప్రభుత్వం తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరుతున్నారు.



'స్థానిక' సమరానికి కాంగ్రెస్ సిద్ధం

- ఎంపీటీసీ, జడ్పీటీసీల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందస్తు ప్రణాళిక
- జడ్పీ చైర్మన్ పదవితో పాటు మూడు మున్సిపాలిటీల కైవసానికి ఎత్తుగడలు
- సమన్వయ కర్తగా మరోసారి సత్తు మల్లేష్
- ఎమ్మెల్యే బొజ్జు, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావులకు సైతం కీలక బాధ్యతలు

నిర్మల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : అధికార కాంగ్రెస్ పార్టీ తన ప్రతిష్ఠను మరింతగా పెంచుకునేందు కోసం రాబోయే స్థానిక ఎన్నికలను లక్ష్యంగా చేసుకుంటోంది. ముఖ్యంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను మెజారిటీగా గెలుచుకొని అత్యధిక ఎంపీపీ పదవులు, దీంతో పాటు జడ్పీ చైర్మన్ పదవిని కైవసం చేసుకోవాలని ఆ పార్టీ సమాయత్తమవుతోంది. అలాగే నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో అత్యధిక కౌన్సిలర్ పదవులను దక్కించుకొని ఈ మూడు చైర్మన్ పదవులను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలంటూ జిల్లా నేతలకు సంకేతాలు అందించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో పాటు డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు తదితర సీనియర్ నేతలతో సీఎం స్థానిక ఎన్నికలపై చర్చించినట్లు చెబుతున్నారు. అయితే గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తరపున సమన్వయ కర్తగా పని చేసి పార్టీ పట్టును విస్తరింపజేసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్‌కు మరోసారి స్థానిక ఎన్నికల బాధ్యతలను అప్పగించినట్లు విశ్వసనీయ సమాచారం. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సత్తు మల్లేష్ నేతలు, కార్యకర్తల మధ్య సమన్వయం చేస్తూ ఎదుటి ప్రత్యర్థి పార్టీలకు దీటైన వ్యూహాలను రచించి ఆ పార్టీలకు ముచ్చెమటలు పట్టించారు. ఇందులో భాగంగానే ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి వెడ్మబొజ్జు విజయం సాధించాడని ఆ పార్టీ వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కారణంగా ఎలాగైనా మెజారిటీ ఎంపీపీ పదవులను, మున్సిపల్ చైర్మన్, జడ్పీ చైర్మన్ పదవులను దక్కించుకోవాలని కాంగ్రెస్ ఉవ్విళ్లూరుతోంది. ఈ ఎన్నికలు పార్టీకి ప్రతిష్ఠాత్మకం కానున్నందున సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా జోక్యం చేసుకుంటూ గెలుపు వ్యూహాలపై దిశానిర్దేశం చేయనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో భారీ మెజారిటీ ఓట్లను సాధించిన సంగతి తెలిసిందే. అయితే అసెం బ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ గెలుపొందగా నిర్మల్, ము థోల్‌లో మాత్రం బీజేపీ విజయం సాధించింది. లోక్‌సభ ఎన్నికల్లో కూడా అదే ట్రెండ్ దాదాపుగా కొనసాగింది. అ యితే ఆ రెండు ఎన్నికల ఫలితాలను పరిగణలోకి తీసుకోకుండా ప్రస్తుత ప్రభుత్వ పనితీరునే ప్రామాణికం చేసుకొని స్థానిక ఎన్నికల వ్యూహాలను రచించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. ఇప్పటికే మండలాల వారీగా పార్టీ నేతలకు, సీనియర్ కార్యకర్తలకు స్థానిక ఎన్నికల విషయంలో సిద్ధం కావాలంటూ ఆ పార్టీ అధిష్ఠానం పరోక్ష సంకేతాలు అందించిందని అంటున్నారు.

స్థానిక ఎన్నికల బాధ్యత సత్తు మల్లేష్‌కే..

కాగా మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ నేతలు, కార్యకర్తల మధ్య చక్కటి సమన్వయం చేసి కాంగ్రెస్ పార్టీ పట్టు నిలిపిన సత్తు మల్లేష్‌కే మరోసారి స్థానిక ఎన్నికల బాధ్యతలను అప్పగించే అవకాశాలున్నాయని విశ్వసనీయ సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత విశ్వసనీయ నేతగానే కాకుండా పీసీసీ ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న సత్తు మల్లేష్ లోక్‌సభ పరిధిలోని అన్ని సెగ్మెంట్‌లలో పర్యటించి పట్టు సాధించినట్లు చెబుతున్నారు. దీంతో పాటు ఎన్నికల వ్యూహాల అమలులో ఆయన పకడ్బందీగా వ్యవహరిస్తారని అలాగే ప్రత్యర్థుల బలాలు, బలహీనతలపై గురి పెట్టి వ్యూహ ప్రతివ్యూహాల రచనలో ఆయనదీ అందెవేసిన చేయిగా చెబుతుంటారు. ఈ వ్యూహాలతోనే పార్టీలో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని చెబుతున్నారు. దీని కారణంగానే సత్తు మల్లేష్‌ను స్థానిక ఎన్నికలకు సైతం సమన్వయకర్తగానే కాకుండా జిల్లా ఇంచార్జీ బాధ్యతలను సైతం అప్పగించే అవకాశాలున్నాయని అంటున్నారు. సత్తు మల్లేష్‌కు ఎమ్మెల్యే వెడ్మబొజ్జుతో పాటు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు తదితర సీనియర్ నాయకులందరితో సన్నిహిత సత్సంబంధాలు ఉండడం కూడా పార్టీకి కలిసి వస్తుందంటున్నారు.

అధ్యక్ష పదవులపైనే గురి..

కాగా ఈ సారి పార్టీ అధికారంలో ఉండడం గతంలో ఎన్నడు లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుండడం లాంటి అంశాలను అస్త్రాలుగా మలుచుకొని ఎలాగైనా ఎంపీపీ, జడ్పీ, మున్సిపాలిటీల అధ్యక్ష పదవులను దక్కించుకునే విధంగా కాంగ్రెస్ పార్టీ పావులు కదుపుతోంది. జిల్లాలోని 19 మండలాల ఎంపీపీల పరిధిలో గల ఎంపీటీసీ స్థానాలను అలాగే మెజారిటీజడ్పీటీసీ స్థానాలను గెలుచుకోవాలని కాంగ్రెస్ పార్టీ తన వంతు ప్రయత్నాలు మొదలుపెట్టింది. మెజార్టీ ఎంపీపీ పదవులతో పాటు ఏకంగా జడ్పీ చైర్మన్ పదవినే ఈ సారి ఎలాగైనా దక్కించుకొని తన పట్టును విస్తరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. దీంతో పాటు నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో మెజారిటీ కౌన్సిలర్ పదవులను దక్కించుకొని అక్కడి చైర్మన్ పదవులను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. అధికారంలో ఉన్న కారణంగా స్థానిక ఎన్నికలు అటు పార్టీకి ఇటు ప్రభుత్వానికి ఛాలెంజ్ కాబోతున్నాయన్న భావనతో కాంగ్రెస్ పార్టీ నేతలు ముందుకు సాగనున్నారు.

సంక్షేమ, అభివృద్ధి పథకాలకే అస్త్రాలుగా..

ప్రత్యర్థి పార్టీలను లక్ష్యంగా చేసుకునేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలనే అస్త్రాలుగా మలుచుకోవాలని కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మొన్నటి ఎన్నికల్లో కీలకపాత్ర పోషించిన మహిళలు, యువకులు, రైతుల ఓట్లను ఈ సారి పెద్ద ఎత్తున దక్కించుకునే దిశగా కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. ఉచిత బస్సు సౌకర్యం, మహిళ సంఘాలకు భారీ మొత్తంలో ఆర్థిక సహాయం అందించడం వంటి కార్యక్రమాలతో మహిళ ఓటర్లను ఈసారి తమ వైపు తిప్పుకునే దిశగా ఆ పార్టీ సిద్ధమవుతోంది. దీంతో పాటు ఉద్యోగాల నియామకాలను అలాగే కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్‌లు లాంటి అంశాలతో యూత్‌పైన, రుణమాఫీతో రైతుల మద్దతును ఈ సారి ఎలాగైనా కూడగట్టుకొని స్థానిక ఎన్నికల్లో విజయం కేతనం ఎగరవేసేందుకు కాంగ్రెస్ పార్టీ నడుం బిగిస్తోంది. స్థానిక ఎన్నికల్లో సంక్షేమ అభివృద్ధి పథకాలే ప్రధానపాత్ర పోషిస్తాయని ఆ పార్టీ భావిస్తోంది. దీనికి అనుగుణంగానే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల పథకాలతో పాటు ప్రస్తుతం అమలవుతున్న పథకాలపై మరింత ప్రచారం చేసి జనం మద్దతు కూడగట్టేందుకు కాంగ్రెస్ అప్రమత్తవుతోంది.

స్వర్ణ ప్రాజెక్టు కాలువ ద్వారా నీటి విడుదల



సాగు నీరును విడుదల చేస్తున్న దృశ్యం

సారంగాపూర్, జూలై 22 : మండలంలో గల స్వర్ణ ప్రాజెక్టు కాలువ ద్వారా ఇరిగేషన్ ఈఈ లక్ష్మీతో పాటు బీజేపీ నాయకులు సాగునీరును విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రాజెక్టు ఆయకట్టు రైతులందరూ సహకారంలో వరినాట్లను వేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు మధుపాల్, దేవేందర్, బీజేపీ నాయకులు రాంశంకర్‌రెడ్డి, విలాస్, గంగారెడ్డి, సాహెబ్‌రావు, బడి పోతన్న, భూమారెడ్డిలతో పాటు నాయకులు ఉన్నారు.

నలుగురిని రక్షించిన బాసర -పోలీసులు



ఇద్దరు పిల్లలతో ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన మహిళను కాపాడిన బాసర పోలీసులు

బాసర, జూలై, 22 : కుటుంబ కలహాల కారణాలతో ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన ఓ మహిళను సోమవారం బాసర పోలీసులు కాపాడారు. మరో ఘటనలో ఇంటి నుంచి చెప్పకుండా వచ్చిన బాలున్ని క్షేమంగా ఇంటికి చేర్చారు. రెండు వేరు వేరు ఘటనలకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం శాంతినగర్‌కు చెందిన ఓ మహిళ కుటుంబ కలహాలతో ఐదు సంవత్సరాలలోపు ఉన్న ఇద్దరు పిల్లలను వెంటబెట్టుకొని బాసర వచ్చారు. బాసర రైల్వే స్టేషన్‌లో అనుమానస్పదంగా తిరుగుతుండడంతో స్థానికులు 100కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు వచ్చి ఇద్దరు పిల్లలతో ఉన్న మహిళను స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. కుటుంబంలో భర్తతో పాటు కుటుంబ సభ్యులు ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు భరించలేకే ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చినట్లు సదరు మహిళ పోలీసులతో చెప్పారు. కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పోలీసులు పంపించారు. ఆదివారం రాత్రి నిఖిల్ అనే బాలుడు బాసర రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వచ్చి విచారించగా బాలుడు ఒక్కడే ఉండడంతో కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆదివారం రాత్రంతా బాలున్ని క్షేమంగా ఉంచుకొని సోమవారం ఉదయం తల్లిదండ్రులకు అప్పగించారు. రెండు ఘటనల్లో నలుగురిని కాపాడిన బాసర పోలీసులను స్థానికుల నుండి ప్రశంసలు వ్యక్తమయ్యాయి.



బాలుడిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు


రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రమాదంలో గాయపడి రోడ్డుపై పడిపోయిన రాజు, దెబ్బతిన్న ద్విచక్ర వాహనం, గాయపడి చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డ సాయవ్వ

దిలావర్‌పూర్, జూలై 22 : మండలంలో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎస్సై రాజేశ్వర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం సారంగాపూర్ మండలం స్వర్ణ గ్రామానికి చెందిన రాజు అనే యువకుడు తన నానమ్మ సాయవ్వ(70)తో కలిసి బైక్‌పై ఆదివారం సాయంత్రం నర్సాపూర్(జి) మండలం రాంపూర్‌లో ఉన్న బంధువుల ఇంటికి వచ్చారు. రాత్రి అక్కడే ఉండి, సోమవారం తిరిగి బైక్‌పై స్వగ్రామం స్వర్ణకు బయలుదేరారు. దిలావర్‌పూర్ బస్టాండ్ సమీపంలో నిర్మల్ వైపు నుంచి భైంసా వెళ్తున్న కారు బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో రాజు, సాయవ్వ రోడ్డుపై చెల్లా చెదురుగా పడిపోయారు. వాహనాల వేగానికి కారు ముందరి చక్రం టైర్ పేలి పోగా, బైక్ ముందరి చక్రం ముద్దయింది. తీవ్రంగా గాయపడిన సాయవ్వ, రాజులను వెంటనే హైవే అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా సాయవ్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. రాజు పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేశ్వర్ గౌడ్ తెలిపారు.

నేడు ఉపాధి హామీ సామాజిక తనిఖీ



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

దిలావర్‌పూర్, జూలై 22 : ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీవో దివ్యరెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ప్రజావేదికకు ఆయా గ్రామాల ఉపాధి హామీ కూలీలు, ప్రజాప్రతినిధులు, పంచాయితీ కార్యదర్శులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

అప్పులబాధతో ఒకరి ఆత్మహత్య



మారుతి మృతదేహం

కుభీర్, జూలై 22 : మండలంలోని సిర్పెల్లి (హెచ్) గ్రామానికి చెందిన జాదవ్ మారుతి (45) అనే వ్యక్తి అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం... మృతుడు మారుతి తన పెద్ద కూతురి పెళ్లి గురించి 2 సంవత్సరాల క్రితం కొంత డబ్బులు బాకీ చేశారు. బాకీ విషయమై తన ఒకటిన్నర ఎకరాల భూమిని అమ్మిన తీరలేదు. దీంతో తన భార్యతో విషయం చెప్పుకుంటూ ఎప్పుడు దిగులు చెందేవాడు. ఈ క్రమంలో సోమవారం ఆటో తీసుకుని వెళ్తున్నానని చెప్పి పల్సి తండాకు వెళ్లి మార్గంలో ఎల్లప్ప వ్యవసాయ భూమిలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫారం దగ్గర ఆటోని ఆపి ఆటోలో నుంచి తీగలు అందక పోయేసరికి ఆటో పైకి ఎక్కి ట్రాన్స్‌ఫార్మర్ గద్దెపైకి ఎక్కి ట్రాన్స్‌ఫార్మర్‌ను ముట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి కుటుంబీకులు సమాచారం అందజేశారు. మృతుడి భార్య జాదవ్ లక్ష్మీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- ప్రజావాణిలో కలెక్టర్ అభిలాష అభినవ్



హాజరైన అధికారులు



అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, జూలై 22 : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. విద్య, వైద్య, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇళ్ల వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, అలాగే సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా కోర్టు కేసులకు సంబంధించిన వివరాలను సమర్పించాలన్నారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ వారి హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండి జిల్లా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత



ఆర్థిక సహాయం చెక్కు, అందజేస్తున్న ఎస్పీ

నిర్మల్ కల్చరల్, జూలై 22 : పోలీసు శాఖలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు అధికారుల కుటుంబాలకు సోమవారం జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డు సంక్షేమ నిధి నుండి మంజూరైన నిధులను వెన్నెల రాధా, గోపు వినోద్ కుమార్ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 15,000ల చెక్కు అందించారు. ఎస్పీ ఈ సందర్భంగా మాట్లాడుతూ... మరణించిన కుటుంబ స్థితిగతులపై ఆరా తీసి వారిని అన్ని విధాలుగా ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. శాఖాపరంగా రావలసిన ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలన్నారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఏవో యూనుస్ అలీ, ఆర్‌ఐ రాంనిరంజన్, హోంగార్డు ఇంచార్జీలు ఆర్‌ఎస్సై సాయికృష్ణ, తదితరులు ఉన్నారు.

బీసీ కులగణన పూర్తయ్యాకే

స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి : బీజేపీ



భైంసా తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందచేస్తున్న బీజేపీ ప్రతినిధులు

భైంసా, జూలై 22 : స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను బీసీ కులగణన పూర్తయ్యాకే నిర్వహించాలని భైంసా పట్టణ కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం సంబంధిత విషయంలో బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు బీజేపీ ప్రతినిధులు మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో బీసీల రిజర్వేషన్లను 23 శాతం నుంచి 43 శాతానికి పెంచుతామని హమీనిచ్చారని పెర్కొన్నారు. ఇప్పుడు సంబంధిత హమీని అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికల సిద్దమవుతున్నారని ఆరోపించారు. బీసీలకు న్యాయం చేసేందుకు గాను రిజర్వేషన్ల పెంపుదల చేపట్టాకే ఎన్నికలను నిర్వహించాలన్నారు. ఇందుకోసం గాను కాలయాపన విధానాలకు తావులేకుండా బీసీ కులగణనకు చర్యలు చేపట్టాలన్నారు. ఇదే క్రమంలో గొల్లకురుమలకు ఉచితంగా గొర్రెల పంపిణీని చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వెల్లడించారు. ఇందులో పీఏసీఎస్ డైరెక్టర్ వడ్నపు శ్రీనివాస్, పార్టీ ప్రతినిధులు రావుల పోశెట్టి, సాహెబ్‌రావ్, పట్టణ కమిటీ ప్రతినిదులు గోపాల్ సూత్రావే, భూ కిరణ్, గాలి రాజుతో పాటు వివిధ మోర్చాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న పంచాయతీ సెక్రటరీలకు సన్మానం

సారంగాపూర్, జూలై 22 : మండలంలో గల ఆయా గ్రామాల్లో గత కొన్ని సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లడంతో సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు శాలువాతో సన్మానించారు

సంక్షిప్త సమాచారం

గడ్‌చందాలో చోరీ

- 32 గ్రాముల బంగారం
- రూ. 20,000 ఎత్తుకెళ్లిన దొంగలు

లోకేశ్వరం రూరల్, జూలై 22 : పట్టపగలు ఇంటి తాళం బద్ధలు కొట్టి బీరువాలోని బంగారం, నగదు దొంగలు దోచుకెళ్లిన సంఘటన లోకేశ్వరం మండలంలో జరిగింది. లోకేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గడ్‌చందా గ్రామానికి చెందిన అంబకంటి లావణ్య ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి ముథోల్‌లో గల కుమారుడి వద్దకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి రాగా ఇంటి తాళం పగల గొట్టి ఉండడం గమనించింది. వెంటనే ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచిన 35 గ్రాముల బంగారం, రూ. 20,000 నగదు కనిపించలేదు. సోమవారం ఉదయం లోకేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దిగంబర్ తెలిపారు. చోరీ అయిన సొత్తు విలువ దాదా పు రూ. 1,50,500 వరకు ఉంటుందని తెలిపారు.

రేపు ప్రభుత్వానికి కృతజ్ఞత సభ

నిర్మల్ కల్చరల్, జూలై 22 : ఉపాధ్యాయులకు ప్రమోషన్లు, బదిలీలు సకాలంలో పూర్తి చేసిన సందర్భంగా బుధవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ ఏర్పాటు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు వై. సాయన్న ఒక ప్రకటనలో తెలిపారు. ప్రియదర్శిని నగర్‌లో ఉదయం 10 గంటలకు సంఘ కార్యాలయం ప్రారంభం సాయంత్రం 4 గంటలకు పెన్షనర్ల సంఘ భవనంలో కృతజ్ఞతసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్రమం తప్పకుండా కురుస్తున్న వర్షాలు

నిర్మల్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్రమం తప్పకుండా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లా సగటు వర్షపాతం 11.8 మిల్లీమీటర్లు నమోదు కాగా, జిల్లాలో అత్యధికంగా సారంగాపూర్ మండలంలో 25 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇదిలా ఉండగా జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టు అయిన కడెం ప్రాజెక్టులోకి ఎగువప్రాంతం నుంచి 6,224 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700ల అడుగులు కాగా 690.825 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు ఒక వరద గేటు ఎత్తి దిగువనున్న గోదావరిలోకి 3,310 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు.

టీఎల్‌ఎం తయారీలో విద్యార్థులకు శిక్షణ



నిర్మల్ కల్చరల్, జూలై 22 : పాఠశాల విద్యార్థులకు బోధనోపకరణాల తయారీపై సోమవారం మంజులాపూర్ ఉన్నత పాఠశాలల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు పద్మ తెలిపారు. విద్యాశాఖ ఆదేశం మేరకు శిక్షా సప్తాహ దినోత్సవాన్ని నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. విద్యార్థులలో సృజనాత్మక శక్తి పెంపొందేందుకు ఈ సప్తాహం ఉపయోగపడుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.